# ఫాన్ మెయిల్

— పొన్నాడ సత్యప్రకాశరావు



"లెటర్సు ఏమన్నా వున్నాయా?" అడిగాడు భానుమూర్తి అప్పుడే ఆఫీసు నుంచి వచ్చి కాఫీ త్రాగుతూ భార్య శమంతకమణిని.

"ఆ ఎవరో అమ్మాయి వ్రాసింది శ్రీవారికి" అంటూ ఓ కవరు దాదాపు విసిరేసి కిచెన్‌లోకి వెళ్ళింది మణి.

"అమ్మాయా?!!" గ్రుక్క పడలేదు. కవరుమీద ఎడ్రస్ చూశాడు.

"మిస్ సునంద, విశాఖపట్నం" అని వుంది ఫ్రమ్ ఎడ్రస్ క్రింద.

"ఎవరీ సునంద?" ఆ పేరు గల అమ్మాయిలెవరూ తన బంధుమిత్రులలో లేరే అనుకుంటూ టెన్షన్ భరించలేక కాఫీ ప్రక్కనపెట్టి కవరు చించి రెండు పేజీల ఉత్తరాన్ని బయటకు తీశాడు.

"మూర్తిగారికి నమస్కరించి వ్రాయునది" ముత్యాలు పేర్చినట్లున్నాయి అక్షరాలు.

కాఫీ కప్పు కోసం వచ్చింది శమంతకమణి ఇంతలో.

"ముందా కాఫీ కానిచ్చి తీరికగా చదువుకోండి ప్రేమలేఖని"

"అబ్బ వుండవే! ఎవరో తెలియక ఛస్తుంటే... అయినా కవరు విప్పకుండా వున్నదానివి మరి కొంచెం సంస్కారం చూపించు" అంటూ కాఫీని మింగేసి కప్పు ఇచ్చేశాడు.

ఉత్తరం పూర్తిచేసిన భానుమూర్తికి గాలిలో తేలుతున్నట్లనిపించింది. అది ఓ అభిమాని లేఖ... అతని మొట్ట మొదటి ఫాన్‌మెయిల్... స్టేషనరీ ఖర్చులు మినహా ఫలితం శూన్యం. సిగరెట్లు కాలిస్తే అయిడియాలు వస్తాయని ఎవడో సుబ్బారావు చెబితే వాటిని మొదలుపెట్టి చెయిన్ స్మోకర్‌గా మారాడు కాని 'ఆంధ్రా చేజ్" కాలేకపోయాడు. అయితే ఎట్టకేలకు "హరివిల్లు" అనే నూతన వారపత్రికలో రెండు నెలల క్రితం ఓ కథ ప్రచురించబడింది. ఆ కథ చదివే అతనిని విపరీతంగా పొగుడుతూ సునంద అనే అమ్మాయి ఉత్తరం వ్రాయటం జరిగింది.

ఫాన్ మెయిల్ గురించి వినడం వేరు. ఫీలవ్వటం వేరు. అతనికి చాలా థ్రిల్లింగ్‌గా వుంది. అందునా అమ్మాయి... భార్య ఉడుక్కోవటం సరదాగా అనిపించింది... తిరిగొచ్చే కథల వెక్కిరింతల మధ్య ఓ కథ వెలుగు చూడటం... పైగా అమ్మాయి గిలిగింత. కథ తిరిగొచ్చినప్పుడు ఎంతో డిప్రెషన్‌కు గురి అయ్యేవాడు. కొంత కాలంపాటు నిర్లిప్తంగా వుండిపోయేవాడు. భార్య ఎంతో చెప్పి చూసేది... మంచి కథకుడు కావడానికి ముందు మంచి పాఠకుడు కావాలనేది. విడవకుండా నిరంతర కృషి జరగాలనేది... కాని భానుమూర్తి వినేవాడు కాదు. కొంతకాలంపాటు పెన్ను ముట్టుకొనేవాడు కాదు.

కృషి... ప్రోత్సాహం ఓ విషస్ సర్కిల్. కృషి చేస్తేనే ఫలితం తద్వారా ప్రోత్సాహం. ప్రోత్సాహం వుంటేనేగాని కృషి ఇనుమడించదు. ఈ రెంటికీ సమన్వయం లేని టైములో ఏ రంగంలోని వారైనా ఎంతో ఫ్రస్టేషన్‌కి గురి అవుతారు.

తన ఓ చిన్న కథకి రెస్పాన్సు... అందులోను ఓ 'మిస్' నుంచి రావటం అతని జీవితాన్నే మార్చివేసింది... కథ పడిన వెంటనే ఉత్సాహంతో వ్రాసిన మరికొన్ని కథలు అతి వేగంగా తిరిగి రావడంతో మళ్ళీ నిరాశకు గురి అవుతున్న తరుణంలో ఆ లేఖ ఎంతో స్ఫూర్తినిచ్చింది. అతని అయిడియాలకు అక్షర రూపాన్నివ్వటం మొదలుపెట్టాడు.

ఆమెకు ధన్యవాదాలు చెబుతూ వ్రాద్దామనుకొన్నాడు. కాని ఆమె పూర్తిగా ఎడ్రస్ ఇవ్వలేదు. ఇంతలో ఆమెనుంచి మరొక ఉత్తరం వచ్చింది. అందులో ఆమె ఏదో పనిమీద అతని వూరు వస్తున్నట్లు వీలు చేసుకొని ఇంటి దగ్గర కలువగలనని వ్రాసింది. తనవెవరయినా ఫూల్ చేస్తున్నారా అనే అనుమానం కలిగింది... లేకపోతే ఆఫ్ట్రాల్ ఒక్క కథకి అంత స్పందనా... కాని ఆమె వ్రాత చూస్తుంటే ... ఏమో... నిజమేనేమో అనిపిస్తోంది. ఇంటికి వస్తాననడంతో అతనిలోని మగాడు గర్వపడ్డాడు... భార్యని మరింత వుడికించాడు. వాడిన వస్తువులును ఎక్కడ పడితే అక్కడ పడేసే భర్త ఇంటి డెకరేషన్‌ని పట్టించుకోవటం శమంతకమణికి కూడా ఆనందం కలిగించింది. అమ్మాయిలకు సాధారణంగా సిగరెట్లు పడవు కాబట్టి త్రాగడం తగ్గించేశాడు. పైగా సునంద తన రెండో ఉత్తరంలో కొంతమంది రచయితల వ్యక్తిగత జీవితాలను విమర్శిస్తూ అతను మాత్రం అతని కథలో హీరోలాగే ఉదాత్తంగా వుంటాడనుకొంటున్నాననడం ఎంతో ఉత్తేజాన్నిచ్చింది.

నెల రోజులు గడిచాయి. రెండు పత్రికలు నిర్వహించిన కథల పోటీలలో అతని కథలు బహుమతుల నందుకొన్నాయి. అందుకు కంగ్రాట్స్ చెబుతూ, అనివార్య కారణాలవలన అతని వూరు రావడం పడలేదని, తనకు పెళ్ళి నిశ్చయమైనదని, భర్తకి అతనంత విశాలదృక్పథం వుంటుందో లేదోనని కాబట్టి ఇకమీదట తను ఉత్తరాలు వ్రాయలేకపోవచ్చునంటూ వ్రాసింది ఆఖరుసారిగా సునంద. చాలాసేపు బాధపడ్డాడు. పరాయి ఆడవాళ్ళ మగవాళ్ళ మీద కోప్పడ్డాడు ఆ రచయితలోని మగాడు... మొత్తానికి తనకి ఎంతో ఉత్సాహాన్నిచ్చి విజయంవైపు నడిపించినందుకు కృతజ్ఞతలు తెలుపుకొన్నాడు.

ప్రతీ మగవాడి విజయం వెనుక ఓ స్త్రీ వుంటుందంటారు. నిరాశలో కొట్టుమిట్టాడుతున్న భానుమూర్తికి ఉత్తేజాన్నిచ్చిన సునంద ఎవరో భానుమూర్తికి తెలియకపోయినా అతని భార్యకు తెలుసు. ఆమె ఎం.ఎ. సైకాలజీ చదివి వైజాగ్‌లో లెక్చరర్‌గా పనిచేస్తున్న నలభై ఏళ్ళ సరళాదేవి... శమంతకమణికి స్నేహితురాలు. ఒకసారి వారిద్దరు కలుసుకొన్నప్పుడు తన భర్త గురించి అతని ప్రయత్నాల గురించి ఫెయిల్యూర్స్ గురించి చెప్పింది శమంతకమణి. అతని తిరిగొచ్చిన కథలను కొన్నింటిని చదివిన సరళాదేవి అతని టాలెంట్‌ని గ్రహించింది... అయితే నిరంతర కృషిలేదని తెలుసుకొంది. ఒక చిన్న కథ పడేవరకు ఆగి సునంద పేరుతో చైతన్యాన్ని కలిగించి సరియైన పంథాలోకి తీసుకొచ్చి తప్పుకొంది.

◆